# నిబంధనలకు విరుద్ధంగా

# బోరువెల్ వినియోగం


## విద్యుత్ మోటార్ బిగించి యదేచ్ఛగా నీటి వాడకం

## చోద్యం చూపుతున్న అధికారులు



పెద్దపల్లి, జులై 02(మనం ప్రతినిధి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని బోర్‌వెల్ గ్రామ ప్రజలకు వినియోగించుకోవాల్సిన బోర్ నీటిని గత రెండెళ్లుగా యదేచ్ఛగా విద్యుత్ మోటార్ బిగించి నీటిని వాడుకుంటున్నా ఇంత వరకు అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. కొత్తపల్లి 6వ వార్డులో చేగుంట రాజయ్య ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా యదేచ్ఛగా గ్రామ పంచాయితికి చెందిన బోర్‌కు బిగించిన హ్యాండిల్ తొలగించి విద్యుత్ మోటర్‌తో నీటిని వాడుకుంటున్నాడు. బోరింగ్ కనబడకుండా చుట్టు చీరలతో కప్పి గ్రామ ప్రజలకు చెందాల్సిన బోర్‌వెల్‌ను ఓ ప్రైవేట్ వ్యక్తి వాడుతున్నా ఇంత వరకు అధికారులు మాత్రం చోద్యం చూపడం వెనుక రహస్యం ఎమిటని గ్రామంలో చర్చజరుగుతోంది. ఇకనైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి ప్రభుత్వ బోర్‌వెల్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.



# మనం

# కరీంనగర్

జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్

సోమవారం | 3 | జులై | 2023 | పేజీలు : 5


## పెరుగుతున్న ధరలకు నిరసనగా...

# మహిళా కాంగ్రెస్ వినూత్న నిరసన



కరీంనగర్, జులై 2 (మనం న్యూస్): బిజెపి, బిఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాల కారణంగానే వంటగ్యాస్, కూరగాయల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయని నిరసిస్తూ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు చెర్ల పద్మ ఆధ్వర్యంలో ఆదివారం వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తలపై కూరగాయల బుట్ట పెట్టుకొని, మెడలో కూరగాయల మాలలను ధరించి, ఇందిరా చౌక్ లో తిరుగుతూ ప్రజలకు నిత్యావసరాల ధరల పెరుగుదలను తెలియజేస్తూ ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరై సంఘీభావం తెలియజేశారు. అనంతరం పద్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్ధ పాలన వల్ల నేడు నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. నిరంతరంగా పెరుగుతున్న ధరలను అదుపుచేయలేని అసమర్ధ పాలన ఇటు రాష్ట్రంలోనూ, అటు కేంద్రంలోనూ కొనసాగుతుండడం దురదృష్టకరమన్నారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో ఆర్టీసీ చార్జీలు, ప్రైవేటు స్కూల్లో ఫీజులు సైతం పెరుగుతున్నాయని, పేద మధ్యతరగతి ప్రజలు కనీసం కూరగాయలతో కూడా రెండు పూటలా భోజనం చేయలేని దుస్థితి నెలకొందన్నారు.

అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కేవలం కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోం దని, రాబోయే ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్‌ల పాలనకు స్వస్తి పలికి కాంగ్రెస్‌కు ఘన విజయం అందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పద్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు షబానా, కవిత, లతా, శారద, పద్మ, మహాలక్ష్మి, మానకొండూర్ కవిత, సులోచన, జ్యోతి, మంజుల, రేణుక, కవిత, కాంగ్రెస్ నాయకులు శ్రావణ్ నాయక్, కుర్ర పోచయ్య, షాహెన్షా గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పంట నష్టపరిహారం వెంటనే ఇవ్వాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



కరీంనగర్ ,జూలై2( మనం న్యూస్): జిల్లాలో మార్చి ,ఏప్రిల్ మాసాల్లో కురిసిన అకాల వర్షాలు, వడగళ్ళ వానలకు పెద్ద ఎత్తున పంటలు నష్టపోయి అన్నదాతలకు ఎకరానికి 10 వేల రూపాయలు పరిహారం చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి మూడు నెలలుగా కావస్తున్న పరిహారం అందలేదని, వెంటనే రైతులకు పంట నష్టపరిహారం అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం రోజున ముకుంద లాల్ మిశ్రా భవన్‌లోవాసుదేవ రెడ్డి మాట్లాడుతూ స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి క్షేత్రస్థాయి పర్యటనలు చేసి వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు ఎకరానికి 10వేల నష్టపరిహారం చెల్లిస్తామని ప్రకటించారని, ఆచరణలో నేటికీ అమలు కాకపోవడం సిగ్గుచేటు అన్నారు.జిల్లాలో సుమారు 60 వేల ఎకరాల పంటలు పూర్తిగా దెబ్బతిని జిల్లా రైతాంగం నష్టపోయారన్నారు. ప్రభుత్వం నేరుగా ఐకెపి కొనుగోలు సెంటర్ల ద్వారా రైతుల నుండి ధాన్యాన్ని సేకరించి రెండు నెలలు కావస్తున్నా రైతుల అకౌంట్లో డబ్బులు జమ కాలేదన్నారు.వెంటనే అకౌంట్ లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వరి నార్లు పోయడం కోసం ఎస్సారెస్పీ, ఎల్ఎండి ద్వారా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో దశలవారీగా పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలోసిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యు. శ్రీనివాస్ డి.నరేష్, నాయకులు జి.తిరుపతి నాయక్, పున్నం రవి లు పాల్గొన్నారు.

# జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ బదిలీ



కొమురంభీమ్ ఆసిఫాబాద్, జులై 2 (మనం న్యూస్)ః కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ని బదిలీ చేస్తూ, ఉట్నూరు ఐటిడిఏ పీఓ గా నియమిస్తూ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. 2019 ఐఏఎస్ బ్యాచ్ చెందిన చాహత్ బాజ్పాయ్ గత ఏడాది జూన్ 13న జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా బాధ్యతలను చేపట్టారు. సంవత్సర కాలం పాటు జిల్లాలో అదనపు కలెక్టర్ గా సేవలందించి స్థానిక సంస్థల బలోపేతానికి కృషి చేశారు. పల్లెల ప్రగతిపై దృష్టి సారించి కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామపంచాయతీలకు అవార్డులను తీసుకురావడంలో ఆమె ఎంతో కృషి చేశారు.

# ఈ ఇంటికి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ నిబంధనలు వర్తించవా?



మెట్ పల్లి, జులై 2 (మనం న్యూస్)ః మెట్ పల్లి మున్సిపల్ తో పాటు డివిజన్‌గా ఏర్పడడంతో దినదినాభివృద్ధి జరుగుతోంది.. దాంతోపాటు ఇళ్ల నిర్మాణాలు ఎక్కువయ్యాయి.. అంతవరకు బాగానే ఉన్నా... గత నెలలో పట్టణంలో నివసించే ఓ దళితుడు పట్టణంలోని అంబేద్కర్ స్టేడియం వెళ్ళు

## పర్మిషన్లు, నిబంధనలు దళితులు నిర్మించుకునే ఇళ్ళకేనా?

రోడ్డు పక్కన ఇంటి నిర్మాణం చేసుకునేందుకు బేసిమెంటు నిర్మాణం చేస్తే ఆదివారంసెలవు దినమైనప్పటికీ మున్సిపల్ అధికారులు మున్సిపల్ కూల్చివేశారు. కానీ బస్సు డిపో నుండి వేంపేట్ వెళ్ళు రోడ్డు పక్కన కొన్ని సంవత్సరాల క్రితం నిర్మితమైన గ్రౌండ్ ఫ్లోర్ ఇంటిపైన ఫస్ట్ ఫ్లోర్ వేసేందుకు ఓ ఇంటి యజమాని పిల్లర్లు వేసి స్లాబ్ కొరకు సెంట్రింగ్ పని చేయించినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ విషయమై గత నెల 19వ తేదీన 'మనం' మున్సిపల్ కమిషనర్ ను వివరణ కోరగా, వివరాలు అందించాలని టౌన్ ప్లానింగ్ అధికారిని ఆదేశించారు. కానీ సదరు అధికారి అందుబాటులో లేకపోవడంతో, ఫోన్‌లో వివరాలడిగితే ఇంటికి అనుమతి ఉందని చెప్పి చేతులు దులుపుకున్నారు. దానికి సంబంధించిన ధృవీకరపత్రాలు అందించాలని కోరితే మాత్రం దాటవేస్తూ వస్తున్నారు. ఈలోగా సదరు ఇంటి యజమాని మొదటి అంతస్తులో స్లాబ్ పనులు పూర్తి చేశారు. అయితే ఆ ఇంటికి చెందిన వివరాలు తెలుపకుండా టౌన్ ప్లానింగ్ అధికారి దాటవేయడంతో మర్మం ఏమిటి అనే సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. లోపాయి కారితనం ఏమైనా జరిగిందా అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

# రెడ్డి సంగం అధ్వర్యంలో పోచమ్మ బోనాలు

### బోనం ఎత్తిన జెడ్పీ ఛైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవ రెడ్డి



సిరిసిల్ల,జూలై2 (మనం న్యూస్): సిరిసిల్ల పట్టణం లో అషాడ మాసం సందర్భంగా పట్టణం లోని రెడ్డి సంఘం అద్యర్యంలో బోనాల పండుగ జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవ రెడ్డి పాల్గొని బోనంఎత్తారు. సకాలంలో వర్షాలు పడాలని కోరుతూ ఇంటింటి నుంచి బోనాలు ఊరేగింపుగా వెళ్ళారు. మహిళలు, యువకులు,పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సంఘం అధ్యక్షులు ముడుపు విజయ భాస్కర్ రెడ్డి ,రంగారెడ్డి, బలరెడ్డి,మహేందర్ రెడ్డి,లక్ష్మా రెడ్డి విఠల్ రెడ్డి,సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూంల హామీ అమలు చేయరా..?

### ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల10న ధర్నా

### బిజెపి సీనియర్ నాయకులు సుగుణాకర్‌రావు

కరీంనగర్, జులై 2 (మనం న్యూస్)ః రాష్ట్రంలోని నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూంలు అందిస్తామని 2014 ఎన్నికల సందర్భంగా ప్రకటించిన కెసిఆర్ ఇప్పటి వరకు అమలు చేయలేదని బిజెపి సీనియర్ నాయకులు, డబుల్ బెడ్ రూమ్ పోరాట సమితి కన్వీనర్ పొల్సాని సుగుణాకర్ రావు విమర్శించారు. ఎన్నికల సందర్భంగా హామీలిచ్చి తొమ్మిదేళ్లు గడిచినా వాటిని అమలు చేయడంలో కనీస ప్రయత్నం కూడా చేయడం లేదన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న ధర్నాకు సంబంధిం చిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆదివారం ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా సుగుణాకర్‌రావు మాట్లాడు తూ రాష్ట్రంలో 27 లక్షల కుటుంబాలకు సొంత ఇల్లు లేదని ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయ న్నారు. ఇల్లు లేని వారందరికీ ఇల్లు ఇస్తానని హామీ ఇచ్చిన కేసీఆర్ 5 లక్షల 72 వేల ఇళ్లకు మాత్రమే మంజూరు చేశారని, అందులో నిర్మాణం అయినవి వందల సంఖ్యలో మాత్రమేనన్నారు. ఉమ్మడి కరీం నగర్ జిల్లాలో కూడా 24 వేల ఇండ్లు మంజూరు చేసి కేవలం 700 మాత్రమే ఇచ్చార న్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇచ్చిన దాదాపు రెండు లక్షల ఇండ్లు నిర్మించకుండా పేదలకు తీవ్ర అన్యాయం చేశారని ఆయన ఆరోపించారు. సొంత ఇల్లు కలిగి ఉండటం గౌరవానికి సూచికగా పదే పదే ప్రకటించిన కెసిఆర్, ఇల్లు నిర్మించకుండా, కేంద్ర ప్రభుత్వ ఇళ్లను అడ్డుకొని అగౌరవపరిచారని ఆరోపించారు. కెసిఆర్ ఇచ్చిన హామీ మేరకు అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూంలు అందించే వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. బిజెపి ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నా కార్యక్రమంలో జిల్లాలోని ఇల్లు లేని వారందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కన్నెబోయిన ఓదెలు, లింగంపల్లి శంకర్, తాళ్లపల్లి హరికుమార్ గౌడ్, గంప జగన్, మొలుగురి కిషోర్, బేతి మహేందర్ రెడ్డి, గడ్డం నాగరాజ్, కామారపు నరహరి, దుర్గం మారుతి, నగునూరి లక్ష్మణ్, మునీర్ ఖాన్, సుజాత రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కూరగాయల తిరుపతి, కనుక చంద్రం, జితేందర్ రెడ్డి, సొన్నాకుల శ్రీనివాస్, మావురాపు సంపత్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు సేవ చేయడమే లక్ష్యంగా రాజకీయాల్లోకి

### గెజిటెడ్ ఆఫీసర్ సంగం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శ్యాం నాయక్

కొమురంభీంఆసిఫాబాద్,జూలై2( మనం న్యూస్): పేదలకు సేవ చేయడమే లక్ష్యంగా స్వచ్ఛంద పదవి విరమణ తీసుకొని ప్రత్యక్ష రాజకీయాల్లోకి వసున్నానని గెజిటెడ్ ఆఫీసర్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్యాం నాయక్ అన్నారు. స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన నేపథ్యంలో తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్ లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్యాం నాయక్ మాట్లాడుతూ ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొని ఉన్నత స్థాయికి చేరుకున్నానని తెలిపారు. చదువుతోనే అన్ని సాధ్యమవుతాయని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలిపారని దాన్ని ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. తాను 2003 నుండి జిల్లాలో ఉద్యోగం చేస్తున్నానని జిల్లా ప్రజలు 2009లో తన భార్య రేఖ నాయక్ ఎమ్మెల్యేగా నిలబడితే ఓట్లు వేసి మూడో స్థానం ఇచ్చారని గుర్తు చేశారు. తర్వాత వచ్చిన ఎన్నికల్లో జెడ్పిటిసి గా అతిపెద్ద మెజార్టీతో గెలిపించారని తన భార్య రాజకీయ ఆరంగేట్రం ఆసిఫాబాద్ కేంద్రంగా జరిగిందని ఆసిఫాబాద్ ను తాను ఎప్పటికీ మర్చిపోలేనని అన్నారు. ఆమె బాటలో తాను నడుస్తున్నట్లు వివరించారు. ప్రజలు ఆశీర్వదిస్తే పేదల పాలిట పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. జిల్లాతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు. అనంతరం శ్యాం నాయక్ సేన ఆధ్వర్యంలో గజమాలతో సన్మానించగా, పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు ప్రజాప్రతినిధులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన జడ్పిటిసి సంతోష్, వివిధ సంఘాల నాయకులు అర్జు మాస్టర్, రేగుంట కేశవ్, సొల్లు లక్ష్మి, బద్రి సత్యనారాయణ, ఎన్జీవో సంఘం జిల్లా నాయకులు రాజశేఖర్, పృథ్వి, బీసీ సంఘం నాయకులు రూప్నర్ రమేష్, మధు, శ్రీనివాస్, జిల్లా డిటిఓ కార్యాలయ ఏవో అరుణ భాయి, యుటిఎఫ్ నాయకులు హేమంత్ షిండే, ఉషన్న తదితరులు పాల్గొన్నారు.



# కోలిండియా నూతన చైర్మన్‌గా ప్రసాద్

## మైనింగ్ రంగంలో 38ఏళ్ల అనుభవం

మందమర్రి, జులై 2 (మనం న్యూస్): కోలిండియా లిమిటెడ్ నూతన చైర్మన్ గా పిఎం ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. గత చైర్మన్ ప్రమోద్ అగర్వాల్ జూన్ 30న పదవీ విరమణ పొందారు.ఆయన హయాంలోనే బొగ్గు గని కార్మికులకు 11వ వేతన ఒప్పందం అమలు కావాలనే పట్టుదలతో కృషిచేసి,అనుకున్న విధంగా ఆయన పదవి విరమణ పొందేలోపే దేశ వ్యాప్త బొగ్గు గని కార్మికులకు నూతన వేతనాల అమలుకు ఉత్తర్వులు జారీ చేయడంలో ఆయన చేసిన కృషిని ఈసందర్భంగా కొనియాడవచ్చు. కాగా సిఐఎల్ నూతన చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన పిఎం ప్రసాద్ మైనింగ్ రంగంలో 38వేల సుదీర్ఘ అనుభవం కలిగి ఉన్నారు. ఈయన కోలిండియా చైర్మన్ గా జులై 1,2023 నుండి అక్టోబర్ 30,2025 వరకు కొనసాగనున్నారు. అంతకు మునుపు ఆయన భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ సిఎండి గా పనిచేశారు. పిఎం 1984లో ఉస్మానియా యూనివర్సిటీ నుండి బీఈ (మైనింగ్) లో పట్టా పొంది, ఆగస్టు 1984లో కోలిండియాలో చేరారు. అప్పటినుండి ఏప్రిల్ 2017 వరకు వెస్ట్రన్ కోల్ ఫిలడ్స్ లిమిటెడ్(డబ్ల్యూసిఎల్), మహానది కోల్ ఫీలడ్స్ లిమిటెడ్‌లలో ట్రైనింగ్ అధికారి నుండి జనరల్ మేనేజర్ వరకు వివిధ పదవులను నిర్వహించారు.వివిధ హోదా లో విధులు నిర్వహిస్తున్నే యాజమాన్యం సహకారంతో ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్ ధన్ బాద్ నుండి 1991లో ఓపెన్ కాస్ట్ మైనింగ్ లో ఎంటెక్ పూర్తి చేశారు.1988లో డిజిఎంఎస్ నిర్వహించిన ఫస్ట్ క్లాస్ మైన్స్ మేనేజర్ సర్టిఫికెట్ పొంది, అదేవిధంగా 1996లో నాగపూర్ విశ్వవిద్యాలయం నుండి న్యాయ శాస్త్రంలో బ్యాచ్యులర్ డిగ్రీ పట్టాను పొందారు.1994-95లో డబ్ల్యూసిఎల్ లోని డిఆర్సి గనిలో భూగర్భ అగ్ని ప్రమాదానికి గురైన ప్రాంతంలో మైనింగ్ ను పునఃప్రారంభించినందుకు గాను ఆయనను 1995లో బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి, కోలిండియా లిమిటెడ్ చైర్మన్ చేత సత్కారం పొందారు.మార్చి, 2012 నుండి ఎంసిఎల్ లింగరాజ్ ఏరియా జనరల్ మేనేజర్ గా ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి,విజయవంతంగా నిర్వహించారు. హింగులా(ఎంసిఎల్) ఏరియా జనరల్ మేనేజర్ గా 2014-15 సంవత్సరంలో హింగులా ఓపెన్ కాస్ట్ ఏరియాలో నది ప్రవాహాన్ని దారి మళ్లించడం ద్వారా మైనింగ్ కోసం 26



మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలను అభివృద్ధి చేయడం,తాల్చేరు కోల్ ఫీలడ్స్ లో నూతన రైల్వేసైడింగ్-9ని ప్రారంభించడం ఆయన సాధించిన విజయాలలో కొన్ని అని చెప్పుకోవచ్చును. మే,2017లో ఎన్టిపిసి లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మైనింగ్) చేరి, ఎండిఓ ప్రాజెక్టుల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేసినందుకు, పక్రిబార్ వాడిహ్ బొగ్గు బ్లాక్(ఎన్టిపిసి మొదటి ప్రాజెక్ట్) అవార్డు, మిగిలిన బొగ్గు క్షేత్రలకు ఎన్ఐటి జారీ చేయించిన ఘనత పొందాడు.మార్చి 2016లో జార్ఖండ్ లోని ఎన్టిపిసి హజారీబాగ్ లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కం ప్రాజెక్ట్ హెడ్ గా బాధ్యతలు స్వీకరించి,పక్రిబార్ వాడిహ్ బొగ్గు క్షేత్రంలో మైనింగ్ కార్యకలాపాలను ప్రారంభించడానికి సవాల్ గా తీసుకొని, ఫిబ్రవరి 2017 కులో అక్కడ బొగ్గు ఉత్పత్తిని ప్రారంభిపజేశారు.కేంద్ర మంత్రి అరుణ్ జెట్లీ, బొగ్గు శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆ రాష్ట్ర మంత్రి జయంత్ సిన్హా సమక్షంలో జార్ఖండ్ ముఖ్యమంత్రి ఫిబ్రవరి 16, 2017న మొదటి బొగ్గు రేక్ ను ఫ్లాగ్ ఆఫ్ చేశారు.ఆయన ప్రాజెక్ట్ హెడ్ గా ఉన్న సమయంలో 2016లో బొగ్గు గనుల ప్రాజెక్ట్ లకు స్వర్ణ శక్తి పురస్కారంలో పక్రిబార్ వాడిహ్ ప్రాజెక్ట్ కు మొదటి బహుమతి లభించింది.

## అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రసమయి, సుడా చైర్మన్ జి వి రామకష్ణారావు



మానకొండూర్, జూలై 02( మనం న్యూస్): మానకొండూర్ మండల కేంద్రంలో పెద్దమ్మతల్లి బోనాల జాతర సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ , బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, సుడా చైర్మన్ జి వి రామకృష్ణారావులు ఆదివారం దర్శించుకున్నారు.ఈ జాతర లో వీరితోపాటు జెడ్పిటిసి తాళ్లపల్లి శేఖర్ గౌడ్, సర్పంచ్ రొడ్డ పృథ్వి రాజ్, ఉప సర్పంచ్ నెల్లి మురళి, ఎంపిటిసిలు ఉండింటి సులోచన శ్యామ్సన్, పిట్టల కవిత-మధు, ఎరవేణి రామాంజనేయులు, ముదిరాజ్ సంఘం నాయకులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శాతరాజు యాదగిరి, గుర్రం కిరణ్ గౌడ్, నెల్లి శ్రీనివాస్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## దళితుల నాయకులపైవివక్ష ఎందుకు సర్కార్‌కు 'బోలుమల్ల' సూటి ప్రశ్న



కరీంనగర్,జూలై 2( మనం న్యూస్): దళిత ప్రజాప్రతినిధుల అంత్యక్రియల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమానవీయంగావ్యవహరిస్తోందని తెలుగుదేశం పార్టీ ఎస్సీ విభాగం కరీంనగర్ పార్లమెంట్ కమిటీ అధ్యక్షు డుబోలుమల్ల సదానందం విమర్శిం చారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన జారీ చేశారు. దళి తుల నాయకుల అంత్యక్రియల విష యం లో రాష్ట్రప్రభుత్వం వివక్ష చూపిస్తోంద నిసదానందం ఆరోపించారు. ఇటీవల హఠాన్మరణం చెందిన దళిత ప్రజాప్రతినిధులు,కంటోన్మెంట్ శాసనసభ్యుడు సాయన్న, తెలంగాణ ఉద్యమ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ అంత్యక్రియలను ప్రభుత్వం అధికార లాంఛనాలతో ఎందుకు నిర్వహిం చలేదనిసదానందం సూటిగా ప్రశ్నించారు. దళిత ప్రజాప్రతినిధులపై సర్కార్కు గల చిన్నచూపే ఇందుకు కారణమని ఆయన పేర్కొన్నారు. అంతకు ముందు కూడా తెలంగాణ ప్రజా కవి గూడ అంజయ్య మృతి విషయంలోనూ సర్కార్ ఇదే ధోరణి అవలంబించిందని ఆయన విమర్శించారు.దళిత ప్రజాప్రతినిధులు, కళాకారుల సేవలు, త్యాగాలను సర్కార్ గుర్తించకపోవడం అన్యాయం,అమానుషయమని, ఇది ముమ్మా టికీ దళిత ప్రజాప్రతినిధులను అవమానించడమేనని సదానందం పేర్కొన్నారు. దళితుల సంక్షేమానికి ఎన్నో రకాలుగా పాటుపడుతున్నామ ని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ వర్గాలకు చెందిన ప్రజాప్ర తినిధులావులను చిన్నవిగా చూస్తూ వివక్ష ప్రదర్శించడం సర్కార్ రాక్షసత్వానికి పరాకాష్ట అని సదానందం పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించే విషయంలో సర్కార్ తీరు మార్చుకోవాలని ఆయన సూచించారు.

## బిజిగిరి షరీఫ్ దర్గాలో ఈటల ప్రత్యేక ప్రార్థనలు



జమ్మికుంట, జులై 2 (మనం న్యూస్): జమ్మికుంట మండలంలోని బిజిగిరి షరీఫ్ దర్గాను ఆదివారం హుజురాబాద్ ఎమ్మెల్యే, బిజెపి జాతీయ నాయకులు ఈటల రాజేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ అధ్యక్షుడు ఇగ్బాల్, దర్గా కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఈటల చాదర్లు నెత్తిన ఎత్తుకొని దర్గాలోని సమాధులకు కప్పి ప్రత్యేక ప్రార్ధనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### తాగునీటి కోసం

## తల్లడిల్లుతున్నాం

### బొమ్మకల్ సర్పంచ్ పురమళ్ళ శ్రీనివాస్‌కి వినతి



కొత్తపల్లి,జూలై02 (మనం న్యూస్): తమ కాలనీవాసులం తాగునీటి కోసం తల్లడిల్లుతున్నామని, తమకు త్రాగునీటి సమ స్య పరిష్కరించి కాలనీవాసులను ఆదుకోవాలని కరీంనగర్ మండలంలోని బొమ్మకల్ గ్రామపంచాయతీ పరిధిలోని విజ యనగర్ కాలనీ రోడ్ నెంబర్ 3,( మహబూబ్ కాలనీ రోడ్ నెంబర్ 1) కాలనీ వాసులు ఆదివారం బొమ్మకల్ గ్రామ సర్పంచ్ పురమళ్ళ శ్రీనివాస్ కు వినతి పత్రం సమర్పించారు. తమ కాలనీ లో కొద్ది దూరం వరకే సిసి రొడ్డు వేసి వదిలి నారని ,దీంతో కొంత వరకు రోడ్డు గుంతలు గుంతలుగా ఉండటంతో నీళ్ళు నిలవడంతో కాలనీలో నడవలేక పోతున్నామని ,పూర్తిస్థాయిలో సిసి రోడ్డు నిర్మాణం చెపాట్టి ,త్రాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీ వాసులు వినతి పత్రంలో పేర్కొన్నారు. వెంటనే స్పందించిన సర్పంచ్ శ్రీనివాస్ సంబంధిత కాంట్రాక్టర్ గంగిరెడ్డి కు చరవాణి ద్వారా సమాచారం అందించి వెంటనే రావాలని కోరగా కాంట్రాక్టర్ రావడంతో ఈసమస్య పరిష్కరంకోసం త్వరితగతిన కాలనీకి వెళ్ళి పరిశీలించి , పనులు చెపాట్టాలని సర్పంచ్ కాంట్రాక్టర్ ను కోరారు. ఈకార్యక్రమంలో కాలనీ వాసులు షాకిర్ ,ఇమ్రాన్ ,శంసూల్ ఉద ,గౌస్ , వలి ,తాహసీన్ ,షఫీ, కాశిఫూల్ ఉద తదితరులు పాల్లోన్నారు.

## ఘనంగా పెద్దమ్మ బోనాల వేడుకలు



తిమ్మాపూర్, జులై 2 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని అలుగునూర్ 8వ డివిజన్‌లో పెద్దమ్మ బోనాలు, పట్నాల వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, పెద్దపట్నం నిర్వహించి, అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ సల్ల శారద రవీందర్, డిసిసి అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్య నారాయణ, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సిల్ల రాములు, సభ్యులు మనోహర్, రాజమల్లు, సిల్ల కుమార్, తునికి స్వామి, యూత్ సభ్యులు సిల్ల గంగాధర్, వినోద్, జంగపల్లి రమేశ్, కాంగ్రెస్ డివిజన్ ప్రెసిడెంట్ రమేష్, నాయకులు గోపు మల్లారెడ్డి, గూడ కనకయ్య, కంది శ్యామ్ సుందర్ రెడ్డి లతో పాటు ప్రజా ప్రతినిధులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గంగపుత్ర సంఘ నగర అధ్యక్షులుగా జితేందర్



కరీంనగర్, జులై 2 (మనం న్యూస్): నగర గంగపుత్ర సంఘం అధ్యక్షులుగా పెద్దపల్లి జితేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం గంగపుత్ర బెస్త విద్యార్థి సంఘ భవనంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని ఐదు డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా దేశ బోయిన శంకర్, అధ్యక్షులు పర్రె రాజేశం, గౌరవ అధ్యక్షులు. పెద్దపల్లి నరేందర్, ఆహ్వాన కమిటీ చైర్మన్ మోసం అంజయ్య, వైస్ చైర్మన్ కంటే రామచందర్, గడప కోటేష్ కుమార్, గడప సత్యనారాయణ, నాగుల రాజారం, మర్రి భీమయ్య, నాగుల కనకయ్య, గడప నరసింహస్వామి, గాండ్ల సత్యనారాయణ, గడప మల్లేశం, మాజీ కార్పొరేటర్ పెద్దపెల్లి రవీందర్, నాగుల సత్యనారాయణ, నాగుల దయానంద్, పెద్ద పెల్లి సత్యనారాయణ. పెద్దపెల్లి కిషన్ రాచకట్ల అమరేందర్ రాజు. ఫిషరీస్ అధ్యక్షుడు రాచకట్ల శ్రీధర్, కంటే రాజేంద్రప్రసాద్. పాక మంగయ్య కడప నాగరాజు ,గడప లక్ష్మీనారాయణ ,పారి పెల్లి నరేందర్ లు, స్థానిక గంగపుత్ర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే

# కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

### -నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

### కాంగ్రెస్‌లో భారీ చేరికలు

### కండువా కప్పి స్వాగతం పలికిన కోమటిరెడ్డి

కరీంనగర్, జూలై 2( మనం న్యూస్): అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీధ్యేయమని నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు.ఆదివారం నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 53,54 డివిజన్ల కు చెందిన దాదాపు రెండు వందల మంది ఉప్పరి అజయ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కండువా కప్పి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పని చేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.ప్రజల అభీష్టం మేరకే ఇతర పార్టీల నుండి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ లో చేరుతున్నారని అన్నారు.తొమ్మిదేళ్ళ బిఆర్ఎస్,బిజెపి పాలనతో ప్రజలు విసిగిపోయి ఉన్నారన్నారు.గడపకు గడపకు కాంగ్రెస్ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరినీ కలిసే కార్యక్రమం చేపట్టామని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రతి ఇంటికి కరపత్రం ద్వారా తెలియజేస్తామని పేర్కొన్నారు.చేరిన వారిలో తమ్మదేవని అఖిల్,మేడిపల్లి హరీష్,మేడిపల్లి తరుణ్,ఊట్ల జాన్ తో పాటు దాదాపు రెండు వందల మంది చేరారు.ఈ కార్యక్రమంలో సమద్



నవాబ్,చర్ల పద్మ,ఎండి తాజ్,శ్రవణ్ నాయక్,గుండాటి శ్రీనివాస్ రెడ్డి,కుర్ర పోచయ్య, సయ్యద్ అఖిల్,దండి రవీందర్, సయ్యద్ ఖంరొద్దిన్,ఎండి చాంద్,దన్న సింగ్,షేక్ శేహెన్ష,షబానా మహమ్మద్,ఊరడి లత,ముల్కల కవిత,అన్నే జ్యోతి,పద్మ,మెతుకు కాంతయ్య,మామిడి సత్యనారాయణ రెడ్డి, తమ్మడి ఎజ్రా,నేహాల్ అహ్మద్,కాంపల్లి కీర్తి కుమార్, సిరాజొద్దీన్, నదీమ్,ఎండి భారీ, హనీఫ్,యోనా,కమల్ తదితరులు పాల్గొన్నారు.

## బెండకాయల మాలల అలంకరణలో అమ్మవారు



కరీంనగర్,జూలై 2 (మనం న్యూస్): కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యలో జరుగుతున్న ఆషాడమాసం శాఖాంబరీ ఉత్సవాలలో భాగంగా ఆదివారం శ్రీదుర్గాభవానీ అమ్మవారిని బెండకాయల మాలలతో అలంకరించారు. ఆలయ పూజారులు అమ్మవారికి విశేష హారతులిచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మెన్ వంగల లక్ష్మన్, ఆలయ కమిటి సభ్యులతోపాటు భక్తులు పాల్గొన్నారు.

## రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి



జమ్మికుంట, జులై 2 (మనం న్యూస్)ః జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి, చికిత్స పొందుతూ మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు... మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఇంక్లిన్ బస్తికి చెందిన సముద్రాల రాజేష్(41) అనే వ్యక్తి టెంట్ హౌస్‌లో పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. హన్మకొండ జిల్లా కమలాపూర్‌లో బంధువు అంత్యక్రియలకు హాజరయై తిరుగు ప్రయాణంలో శనివారం రాత్రి జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో 3వ నెంబర్ ప్లాటుఫామ్ పై ఆగి ఉన్న గూడ్స్ రైలు కింది నుండి వెళ్లి ప్లాటుఫామ్ ఎక్కే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో ఆ రైలు కదలగా అదుపుతప్పి దాని కింద పడి రెండు చేతులు తెగిపోయాయి. చికిత్స కొరకు 108 అంబులెన్స్ ద్వారా హుజురాబాద్ ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, కొడుకు, కూతురున్నారు. మృతుని భార్య సముద్రాల సత్తమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అభివృద్ధిని కాంక్షించే బిఆర్ఎస్‌లో చేరికలు

### బిఆర్ఎస్ ఎండపల్లి మండల అధ్యక్షులు జగన్



వెల్గటూర్, జూలై 2 (మనం న్యూస్): అభివృద్ధిని కాంక్షించే బిఆర్ఎస్ పార్టీలో భారీ చేరికలు జరుగుతున్నాయని ఆ పార్టీ ఎండపల్లి మండల అధ్యక్షుడు సింహాచలం జగన్ అన్నారు. ఆదివారం రాజారాం పల్లి గ్రామంలోని ఎండ పల్లి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పతనం ప్రారంభమైందని, దిక్కుతోచని స్థితిలో గత ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్ కుమార్ నిరాధార ఆరోపణలు చేస్తూ కాలం వెళ్ళదీస్తున్నారని, పార్టీలో చేరిన కార్యకర్తల పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తను సోదరుని లా ఆక్కును చేర్చుకుంటామని, అభివృద్ధి కాంక్షించే ప్రతి ఒక్కరికి పార్టీలో స్థానం ఉంటుందని అన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ పతనావస్థకు చేరుకుంటుందని జోస్యం చెప్పారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు మేకల సంతోష్ మాట్లాడుతూ అభివృద్ధిని కాంక్షించే బిఆర్ఎస్‌లో చేరానని, తనపై కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ కుమార్ నిరాధార ఆరోపణలు చేస్తూ విమర్శిస్తున్నారని, ఆరోపణల పై ధర్మపురి ,కోటిలింగాల ఆలయాలలో ప్రమాణాలు చేయడానికి సిద్ధం గా ఉన్నానని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు రేండ్ల కృష్ణ, నాయకులు సంగ రమేష్, ఉప సర్పంచ్ సంగ రాములు , మెరుగు జాని, మేకల సంతోష్, రమేష్, భూమయ్య, జంపయ్య స్వామి చంద్రయ్య, అంజయ్య ,కుమార్ కొమురయ్య, బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్ర మోడీ పాలన ప్రపంచానికే ఆదర్శం

### తమిళనాడు బిజెపి నాయకులు రాధా కిషన్



జమ్మికుంట, జులై 2 (మనం న్యూస్)ః ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరిపాలన ప్రపంచానికే ఆదర్శమని తమిళ నాడు బిజెపి నాయకులు రాధాకిషన్ అన్నారు. మేరా భూత్ సబ్ సే మజ్బూత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం జమ్మికుంట పట్టణంలోని పద్మశాలి వాడ, లెక్షరర్స్ కాలనీ, కి సంబంధించిన శక్తి కేంద్ర పరిధిలోని 12 బూత్ కమిటీలను పరిశీలించారు. అనంతరం రాధాకిషన్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా వుండడం కోసం అనేక రకాల ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందని, ఆ పథకాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బిజెపి కేంద్ర నాయకత్వం తెలంగాణ మీద ప్రత్యేక దృష్టి పెట్టిందని, దానిలో భాగంగానే తాను ఇక్కడికి వచ్చానన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్,జమ్మికుంట మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్, కోరే రవీందర్, పల్లపు రవి, అప్ప మధు యాదవ్, ఇటికాల స్వరూప, ఎదులాపురం అశోక్, కంకణాల రమా రెడ్డి,ఠాగూర్ రాజేష్, కైలాస కోటి గణేష్, మోడం రాజు, రావుల శ్రీనివాస్, ఠాగూర్ రాకేష్, బూరుగుపల్లి రామ్, శనిగరపు రవి, ఇల్లందుల శ్రీనివాస్, బూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ సభకు తరలిన బిజెపి శ్రేణులు



శంకరపట్నం, జులై 2 (మనం న్యూస్)ః గుండ్లపల్లిలో జరుగనున్న మహా సంపర్క్ అభియాన్ బహిరంగ సభకు ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు, ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు ఏనుగుల అనిల్, జిల్లా కార్యవర్గ సభ్యులు జంగ జైపాల్, మండల ప్రధాన కార్యదర్శులు నరేందర్, సంపత్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు కనకం సాగర్, ఎస్టి మోర్చా మండల అధ్యక్షులు బిజిలి సారయ్య, బూత్ అధ్యక్షులు రవి, రమేష్, శ్రీనివాస్, రాములు. మండల నాయకులు అనిల్ పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న ఎస్ఐ ఫరీద్‌ను సన్మానం

రామకృష్ణాపూర్,జూలై 02 (మనం న్యూస్): రామకృష్ణాపూర్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఫరీద్ రామగుండానికి బదిలీ కావడంతో ఆదివారం క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా ఆయనకు సత్కరించారు.పట్టణంలోని పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ బి.అశోక్ చేతుల మీదుగా ఫరీద్‌కు శాలువా కప్పి స్వీట్లు తినిపించారు.ఈ కార్యక్రమంలో క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కలువల శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి రామిల్ల శ్రీనివాస్,కోశాధికారి పరికిపండ్ల రాజు,ఉపాధ్యక్షులు తూముల భవిష్యత్, సంయుక్త కార్యదర్శి పోలు దాసరి శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.



# కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ

## ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



పెద్దపల్లి, జులై 02(మనం ప్రతినిధి): జూలపల్లి మండలం వడ్కాపూర్ గ్రామంలో సీడీపీ నిధుల ద్వారా రూ.4 లక్షలతో నిర్మిస్తున్న మాల కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆదివారం భూ మిపూజ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రఘువీ ర్‌సింగ్, ఎంపీపీ రమాదేవి రాంగోపాల్ రెడ్డి,పిఏసీఎస్ చైర్మన్లు వేణుగోపా ల్‌రావు, మండల పార్టీ గౌరవాధ్యక్షుడు కంది చొక్కారెడ్డి, ఎంపీపీ మొగురం రమేష్, కుంట రాజేశ్వర్‌రెడ్డి, తమ్మడ వేని మల్లేశం, సర్పంచ్ తిరుపతి, మాజీ సర్పంచ్ కృపాకర్‌రావు, మాజీ ఎంపీటీసీ ఎర్రోళ్ల రాములు, గ్రామ శాఖ అధ్యక్షుడు కన్నం రమేష్, సర్పం చ్‌లు శకుంతల రవీందర్, ఎల్లయ్య, పద్మశ్యామ్, అనగోని శ్రీనివాస్, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



పెద్దపల్లి, జులై 02(మనం ప్రతినిధి): ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన చెక్కులను ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 173మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీలు, జెడ్పిటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్,పీఏసీఎస్ చైర్మన్లు, ఎఎంసీ డైరెక్టర్లు, పట్టణాధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, కో ఆప్షన్‌లు, ఉప సర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతనంగా ఎన్నికైనా నాయకులకు సన్మానం



సిరిసిల్ల, జూలై 2 (మనం న్యూస్): తెలుగుదేశం పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జిగా 2వ సారి ఎన్నికైనా సందర్బంగా ఆవునూరి దయాకర్ రావు ,రాష్ట్ర బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శులుగా ఆడేప్ లక్ష్మీనారాయణ,మ్యాన వెంకటేశం,రాష్ట్ర అధికార ప్రతినిధి దామేర సత్యం,సీనియర్ నాయకులు దుమాల సత్యనారాయణ,ఇరుకుల్ల భాస్కర్,మజీద్ కమిటీ అధ్యక్షులు ఎన్నికైనా ఆయుబ్ ఖాన్,బాష్ మియా సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు తీగల శేఖర్ గౌడ్ శాలువ కప్పి ఘనంగా సత్కరించారు.పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి సిరిసిల్ల జిల్లా నుండి రాష్ట్ర కమిటీలో పలు పదవులకు స్థానం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు మోతె రాజిరెడ్డి,మోతె స్నేహారెడ్డి,రంగు శేషచలం గౌడ్,జెట్టి కొమురయ్య,బింగి వెంకటేశం,ఆడెపు సత్తయ్య,పిస్క మల్లేశం,పండుగ స్వామి,మాలోత్ సూర్యనాయక్,చెట్కూరి నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న ఆరెపల్లి



మానకొండూరు, జులై 2 (మనం న్యూస్)ః మానకొండూర్ మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయాన్ని మానకొండూరు మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ ఆదివారం దర్శించుకున్నారు. జాతర సందదర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు సమర్పించారు. ఈ శ్రీనివాస్ నగర్ ఎంపిటిసి రామానుజం, సుల్తానాబాద్ మాజీ జెడ్పిటిసి సభ్యులు గుర్రాల మల్లేశం, మాజీ ఎంపిటిసి సభ్యులు సత్యం, ఉపసర్పంచ్ మురళి, పిట్టల మధు, శ్యామ్సన్, జాగిరి రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీలోని గిరిజనేతర రైతుల సమస్యలు పరిష్కరించాలి

కొమురంభీం ఆసిఫాబాద్, జులై 2 (మనంన్యూస్)ః ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతర రైతుల సమస్యలు పరిష్కరించాలని గిరిజనేతరుల సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ ఫయాజ్ , ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు అనిల్ మోతే రావు , గిరిజనేతరుల సంఘం జిల్లా నాయకులు షేక్ దస్తగీర్ , జాకీరుల్ల ఖాన్‌లు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చి రైతు బంధు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతర రైతులు దాదాపు ఐదు దశాబ్దాల నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని బ్యాంకు రుణాల సదుపాయం, రైతు బంధు లేకపోవడం వల్ల గిరిజనేతర రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి గిరిజనేతర రైతుల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని ఉర్దూ మీడియం పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియమించకపోవడం తో ఉర్దూ మీడియం విద్యనభ్యసించే పిల్లలు విద్యకు దూరం అవుతున్నారని ఉపాధ్యాయులు లేకపోవడం వల్ల పాఠశాలలు మూతపడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని ఉర్దూ మీడియం పాఠశాలల్లో వివిలను నియమించి పాఠశాలలు కొనసాగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజనేతరుల సంఘం నాయకులు సిద్దార్థ్ కొట్టంబే , గాయక్వాడ్ మారుతి, కిషన్ మోరే, డి మొరాజీ, భీమ శంకర్ కాంబ్లే , హాకిం అన్సారీ తదితరులు పాల్గొన్నారు.


మనం కావలెను
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

'మనం' తెలుగు దినపత్రికకు ఈ దిగువ పేర్కొన్న సర్కిల్స్ పరిధిలో విలేకరులుగా పనిచేసేందుకు ఉత్సాహవంతులు కావలెను. చక్కటి రాత, తెలుగుభాషపై పట్టు ఉండి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవి.

కావలసిన ప్రాంతాలు :

కరీంనగర్ జిల్లా : సైదాపూర్, గంగాధర, గన్నేరువరం, హుజురాబాద్ ఆర్.సి. రామడుగు
పెద్దపల్లి : పెద్దపల్లి టౌన్ & రూరల్, జూలపల్లి, పాలకుర్తి, అంతర్గాం, గోదావరిఖని టౌన్, జ్యోతినగర్, రామగుండం, 8 ఇన్ క్లైయిన్ కాలని, కమాన్‌పూర్
మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
రాజన్న సిరిసిల్ల : వేములవాడ (ఆర్.సి), వేములవాడ టౌన్ & రూరల్, కోనారావుపేట, రుద్రంగి, చందుర్తి, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట.
జగిత్యాల : జగిత్యాల టౌన్ & క్రైమ్, మేడిపెల్లి, కోరుట్ల రూరల్, ఇబ్రహీంపట్నం, గొల్లపల్లి, సారంగాపూర్, మల్యాల, కొడిమ్యాల

మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక
ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యాలయం
సాయికృష్ణ థియేటర్ ఎదురుగా
భగత్‌నగర్, కరీంనగర్.
పూర్తి వివరాలకై సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
సెల్ : 83339 98076
Friends Digitals, KNR - 7989030554